క్లుప్తంగా

నేడు వరదయ్యపాళెంలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

వరదయ్యపాళెం: మండల కేంద్రంలోని సచివాలయం-1లో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 3గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొంటారని పేర్కొన్నారు. పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు హాజరు కావాలని ఆయన కోరారు.

ఆంజనేయస్వామికి విశేష పూజలు


విశేషాలంకరణలో ఆంజనేయస్వామి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని 16కాళ్ల మండపంలో వెలసిన శ్రీఆంజనేయస్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ముందుగా పలు రకాల అభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. సింధూర వర్ణంలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అధికారులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత పారాయణంలో ప్రతిభ


బహుమతి అందుకుంటున్న ప్రవాసిని

శ్రీకాళహస్తి: చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో జరిగిన భగవద్గీత పారాయణం (చిన్మయ్య చాన్టింగ్ కాంపిటేషన్)లో శ్రీకాళహస్తి విద్యార్థిని ప్రతిభ చాటింది. గత నెలలో పోటీలు జరుగగా, ఆదివారం బహుమతుల ప్రదానం కార్యక్రమం తిరుపతి చిన్మయ మిషన్ కార్యాలయంలో జరిగింది. శ్రీకాళహస్తిలోని ఒక ప్రైవేటు పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న ఎం.ప్రవాసిని మొదటి బహుమతి సాధించింది. ముఖ్యఅతిథులుగా విచ్చేసిన రేణిగుంట గీతాశ్రమం స్వామి పవిత్రానంద, చిన్మయ మిషన్ కార్యదర్శి రాజశేఖర్, కోశాధికారి బహుమతి ప్రదానం చేశారు.

పవర్ టిల్లర్‌తో బహుళ ప్రయోజనాలు

బుచ్చినాయుడు కండ్రిగ : చెరకు రైతులకు పవరు టిల్లర్లు ఎంతో ఉపయోగమని వ్యవసాయాధికారిణి భారతి తెలిపారు. ఆమె మంగళవారం మండల కేంద్రంలో రైతులకు పవర్ టిల్లర్ వాడకంపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ పవర్ టిల్లర్‌తో భూమి దున్నడం, చెరుకులో కలుపు తీయడం లాంటి పనులు తక్కువ ఖర్చుతో తక్కువ సమయంలో చేపట్టవచ్చన్నారు. ఇతర ప్రయోజనాలను వివరించారు. సబ్సిడీతో పవర్ టిల్లర్‌ను పంపిణీ చేస్తున్నారని, ఆసక్తి కలిగిన రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


ఎంపీడీఓకు వినతి అందజేస్తున్న కార్యకర్తలు

ఏర్పేడు: తమ సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు మంగళవారం ఎంపీడీఓ గిడ్డయ్యకు వినతి పత్రం అందజేశారు. వేతనాలు పెంపు, గ్రాడ్యుటీ, మినీ కేంద్రాలు మెయిన్‌గా మార్పు, ప్రమోషన్లు, రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలకు పెంపు, రిటైర్డ్‌మెంట్ వయస్సు 62కు పెంపు, వైఎస్సార్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీల పెంపు తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. సంఘం నాయకురాళ్లు పాండురంగమ్మ, రోహిణికుమారి, లక్ష్మి, లావణ్య, సంధ్యాలక్ష్మి, సునీత, సుమతి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియపై సమీక్ష


మాట్లాడుతున్న ఆర్డీఓ రవిశంకర్‌రెడ్డి

శ్రీకాళహస్తి: ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం అఖిలపక్ష నాయకుతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియపై చర్చించారు. సలహాలు, సూచనలు తీసుకున్నారు. సీపీఐ, సీపీఎం, బీజేపీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కండలేరులో 11.040 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 11.040 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. వరదకాలువ నుంచి జలాశయానికి 400 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుందన్నారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగ కాలువకు 40 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ స్లూయిస్‌కు 235 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పారదర్శక పాలన జగనన్నకే సాధ్యం


నారాయణవనం : జెండా ఆవిష్కరణలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

సత్యవేడు: సాధికారత, సంక్షేమాభివృద్ధి సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. మంగళవారం పెద్ద ఈటిపాకం సచివాలయ ఆవరణలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత జెడ్పీటీసీ సభ్యురాలు పి.విజయలక్ష్మి, పార్టీ శ్రేణులతో కలిసి పథకాల లబ్ధి వివరాలను తెలిపే డిజిటల్ బోర్డును ప్రారంభించి, వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదవాని కష్టాలు తీర్చేందుకు తానున్నానని చెప్పి, వారి జీవితాల్లో వెలుగు నింపింది ఒక్క ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మాత్రమేనని తెలిపారు. ఇలాంటి పాలన కావాలంటే వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ప్రజలు మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. పంచాయతీ పరిధిలో వివిధ పథకాల ద్వారా రూ.19.17కోట్లు లబ్ధి పొందారని తెలిపారు. ఇచ్చిన హామీల్లో 99 శాతం జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి చేశారని, గతంలో చంద్రబాబు 650 హామీలు ఇచ్చి 10 కూడా అమలు చేయకుండా, మళ్లీ మాయమాటలు చెప్పడానికి తయారయ్యారని విమర్శించారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి కే. చంద్రశేఖర్ రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ బి. సోమశేఖర్, ఎంపీటీసీలు కె.శెల్వి, రమణ, సర్పంచులు పి.రూబెన్, హెచ్.గోవిందస్వామి, ఎంపీడీఓ చంద్రశేఖర్, వైద్యశాల కమిటీ సభ్యుడు ఈ. గోవిందస్వామి, వ్యవసాయ కమిటీ చైర్మన్ కె.శ్యాంప్రసాద్ రెడ్డి, నాయకులు రవిరెడ్డి, జి.శేఖర్, శ్రీనివాసులు రెడ్డి, సన్యాసయ్య, పూల పళణి, టెంకాయల కృష్ణయ్య, ఈటీపీఆర్డీ మునిరవికుమార్, సెక్రటరీ శైలజ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథికి మళ్లీ పట్టం కట్టండి

నారాయణవనం: రాష్ట్రంలో నవరత్నాలతో పాటు సంక్షేమం కొనసాగాలంటే మళ్లీ సీఎంగా జగనన్నే కావాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం తుంబూరు వద్ద పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరూ ఎదురు చూడలేని సంక్షేమాన్ని అన్ని వర్గాల ప్రజలకు సీఎం జగనన్న అందించారని అన్నారు. సంక్షేమంతో పాటు ఇంటి వద్దకే అందుతున్న ప్రభుత్వ సేవలు కొనసాగాలంటే మళ్లీ జగనన్నే రాష్ట్రానికి ముఖ్యమంత్రిని చేసే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మధ్యాహ్నం తుంబూరు సచివాలయంలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' సమావేశంలో సంక్షేమ డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు కోనేటి సుమన్‌కుమార్, సర్పంచ్‌లు నాగూరు, అమ్ములు, ఎంపీటీసీ సభ్యులు హారతి, ఎంపీడీవో కృష్ణమూర్తి, మండల అధికారులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సారకాయలు, నాయకులు పరంధామరెడ్డి, ప్రసన్న, బాలాజీరెడ్డి, మహేష్ పాల్గొన్నారు.

నాగలాపురం మండలంలో..

నాగలాపురం: మండలంలోని టీపీకోట సచివాలయంలో మంగళవారం వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అపరంజిరాజు ఆధ్వర్యంలో ఎంపీడీఓ పీకేఎం బాబు అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం జరిగింది. అపరంజిరాజు మాట్లాడుతూ మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి సంక్షేమ పథకాల మొత్తాలు పడుతున్నాయని తెలిపారు. పారదర్శక పాలన కావాలంటే మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం సంక్షేమ లబ్ధి బోర్డును ఆవిష్కరించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. సర్పంచ్‌లు సుధా చిన్నదొరై, సక్కుభాయి, జెడ్పీటీసీ సుమతి మహేష్ రెడ్డి, ఎంపీపీ సింధూ శ్యామ్, ఈఓ పీఆర్డీ వెంకటేశ్వరులు, నాయకులు, ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పాల్గొన్నారు.

జగనన్నతోనే ఆర్థిక ప్రగతి

కేవీబీపురం: పేద ప్రజలు ఆర్థిక ప్రగతి సాధించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని, జన రంజక పాలన కావాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరొకసారి ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గవర్లకృష్ణయ్య కోరారు. మంగళవారం మండలంలోని రాజుల కండ్రిగ సచివాలయంలో పార్టీ నేత లాల్‌బాబుయాదవ్ ఆధ్వర్యంలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమన్ని నిర్వహించారు. కృష్ణయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలతో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్న జగనన్నను మరొక సారి ముఖ్యమంత్రిని చేసుకుంటే భావి తరాలకు కచ్చితమైన భరోసా కలుగుతుందని తెలిపారు. పథకాల లబ్ధిని వివరించే బోర్డును ప్రారంభించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. నాయకులు నందకుమార్, సచివాలయాల మండల కన్వీనర్ శాస్త్రి రాజు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు డేవిడ్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటరత్నం, సర్పంచ్‌లు ప్రమీలమ్మ, రామ్మోహన్‌వర్మ, పురుషోత్తం, పరశురామ్, గిరినాయడు తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ మండలంలో..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పార్లపల్లి గ్రామ సచివాలయం వద్ద మంగళవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం జరిగింది. తొలుత వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు అరణివిద్యానాథరెడ్డి పథకాల వివరాల డిజిటల్ బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లపలి సచివాలయాల పరిధిలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కలిపి రూ.10 కోట్ల 75 లక్షలు ఖర్చు చేసినట్లు తెలిపారు. అభివృద్ధి కోసం జగనన్నను మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. సింగిల్ విండో చైర్మన్ హరనాథ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ మునికృష్ణారెడ్డి, సర్పంచ్‌లు వెంకటస్వామి, సుబ్బరత్నమ్మ, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాల్‌రెడ్డి, నాయకులు అజయ్‌కుమార్‌రెడ్డి, చలపతి, భాస్కర్ రెడ్డి, సంజీవయ్య, తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం మండలంలో..

వరదయ్యపాళెం: మండలంలోని సంతవేలూరులో మంగళవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. పథకాల డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ నందయ్య మాట్లాడుతూ సచివాలయ పరిధిలో అభివృద్ధి, సంక్షేమం కోసం రూ.38కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, జేసీఎస్ మండల కన్వీనర్ చిన్నా, సింగిల్ విండో చైర్మన్ హరిబాబురెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పాల సుబ్రమణ్యం రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు మణి, ఆయకట్టు మాజీ చైర్మన్ లక్ష్మణ్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ పరంధామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




కేవీబీపురం : మాట్లాడుతున్న గవర్లకృష్ణయ్య, నాగలాపురం: మాట్లాడుతున్న అపరంజిరాజు, బీఎన్‌కండ్రిగ: పార్టీ జెండా ఆవిష్కరణలో నాయకులు

అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించాలి


సన్మానం అందుకున్న అధికారులతో ప్రజాప్రతినిధులు

ఏర్పేడు: అధికారులు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలను పరిష్కరించాలని, గ్రామ సచివాలయాలకు వచ్చే ప్రజలకు సరైన సమాచారం అందించాలని ప్రజాప్రతినిధులు కోరారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ గీత ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం జరిగింది. పలు శాఖలలోని సమస్యలను ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు సమావేశం దృష్టికి తీసుకుని వచ్చారు. సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు అందుబాటులో ఉండటంలేదని తెలిపారు. రైతులకు వ్యవసాయ సాగుకు సంబంధించి తగు సలహాలు ఇవ్వడం లేదని ఏఓ షణ్ముగంకు ఫిర్యాదు చేశారు. జెడ్పీటీసీ తిరుమలయ్య మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం మంజూరు చేసిన డీకేటీ భూములకు సెటిల్‌మెంట్ పట్టాలు ఇస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే రెవెన్యూ అధికారులు 3 వేల ఎకరాలను గుర్తించినట్లు చెప్పారు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో జగనన్న కాలనీలలో గృహ నిర్మాణాలు ఆలస్యమవుతున్నాయని చెప్పారు. తహసీల్దారు అందుబాటులో లేనందున జగనన్న కల్యాణమస్తు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు.

అధికారులకు సన్మానం

ప్రభుత్వ పథకాలు, కార్యకలాపాలలో ఉత్తమ సేవలు అందించిన అధికారులు ఎంపీడీఓ గిడ్డయ్య, ఈఓపీఆర్డీ మురళి, ఏర్పేడు పీహెచ్‌సీ డాక్టర్ శివప్రియ, పశు వైద్యురాలు శిల్పారెడ్డి, ఏపీఎం పళణికుమార్, ఏపీఓ దేవరి, ఎస్పీడీసీఎల్ ఏఈ వాసుదేవయ్య, పంచాయతీ కార్యదర్శి మురగయ్య తదితర అధికారులు, పంచాయతీ కార్యదర్శులను సన్మానించి, వారి సేవలను కొనియాడారు. వైస్ ఎంపీపీలు తిరుపతి జనార్ధన్‌రెడ్డి, జమ్మళ శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్, సింగిల్‌విండో అధ్యక్షుడు జనార్దన్ యాదవ్, కో-ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

త్వరితగతిన నాడు-నేడు పనులు


మాట్లాడుతున్న డీఈఓ శేఖర్

పిచ్చాటూరు: పిచ్చాటూరు ఐసీడీఎస్ పరిధిలోని నాలుగు మండలాల్లో నాడు-నేడు పథకం కింద అంగన్‌వాడీ భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి శేఖర్ ఆదేశించారు. మంగళవారం స్థానిక సీడీపీఓ కార్యాలయంలో పిచ్చాటూరు, నాగలాపురం, నారాయణవనం, కేవీబీ పురం మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలతో డీఈఓ సమావేశమైయ్యారు. ఆయన మాట్లాడుతూ ఫేస్-2 కింద మంజూరైన నిధులతో చేపడుతున్న అంగన్‌వాడీ భవన నిర్మాణాలు, మరమ్మతు పనుల పురోగతిని మండలాల వారీగా సమీక్షించారు. పనులు డిసెంబర్ చివరి కల్లా పూర్తి చేయాలని సూచించారు.

దివ్యాంగ పిల్లలకు ట్యాబ్‌ల పంపిణీ

పిచ్చాటూరు జెడ్పీ హైస్కూల్ ప్లస్‌ను డీఈఓ శేఖర్ తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. ఇంటర్ విద్యార్థులను పలు ప్రశ్నలు వేసి సామర్థ్యాలను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. దివ్యాంగ విద్యార్థులకు, ప్రత్యేక ఉపాధ్యాయులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ప్రభుత్వం అందించే ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, టీచర్లు అంకిత భావంతో పని చేసి పిల్లల ఉన్నతికి పాటుపడాలని సూచించారు. స్టేట్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ రెడ్డి, ప్లానింగ్ కోఆర్డినేటర్ రామచంద్రా రెడ్డి, ఎంఈఓ యుగంధర్ రాజు, హెచ్‌ఎం గిరి ప్రకాష్, టీచర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పాల్గొన్నారు.

ఎరువులను అందుబాటులో ఉంచాలి


ఎరువులను పంపిణీ చేస్తున్న ఏడీఏ సుబ్రమణ్యం

వరదయ్యపాళెం: ప్రస్తుత రబీ సీజన్‌కు అవసరమైన కాంప్లెక్స్ ఎరువులను రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అందుబాటులో ఉంచాలని వ్యవసాయశాఖ సత్యవేడు ఏడీఏ సుబ్రమణ్యం సూచించారు. మంగళవారం మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో ఆయన వ్యవసాయశాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మండలంలో రబీ సీజన్‌లో సాగు చేసిన పంటల వివరాలను తెలుసుకున్నారు. పంటలకు వినియోగించాల్సిన ఎరువుల మోతాదుపై గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే ఎరువులను విక్రయించి, సంబంధిత నగదును ఎప్పటికప్పుడు బ్యాంకులో జమ చేయాలని సూచించారు. అనంతరం సీఎల్‌ఎన్‌పల్లె ఆర్బీకే వద్ద ఏడీఏ ఎరువుల పంపిణీని ప్రారంభించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి సుహర్‌లత, ఏఈఓ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కూలీ రైతుగా ఎదగాలి


భూ పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

కేవీబీపురం: అర్హత కలిగి ఉన్న ప్రతి పేదవాడు రైతుగా అభివృద్ధి చెందాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో పేదలకు భూ పట్టాలను పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న సురక్షలో దరఖాస్తు చేసుకున్న అర్హులైన పేదలకు పట్టాలను అందజేసినట్లు తెలిపారు. అర్హత కలిగిన ప్రతి కూలీగా రైతుగా అభివృద్ధి చెందాలన్నదే ముఖ్యమంత్రి జగనన్న లక్ష్యమని పేర్కొన్నారు. దరఖాస్తులను పరిశీలించి అర్హత ఉన్న 56 మందికి వారి సాగులో ఉన్న దరకాస్తు భూములకు పట్టాలు ఇచ్చినట్లు తెలిపారు. అధికారులు భూ పట్టాల పంపిణీపై దృష్టిపెట్టి, పేదలందరికీ న్యాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు గ్రామాలకు చెందిన 51 మందికి వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా కింద రూ.38.85 లక్షల మెగా చెక్కును ఎమ్మెల్యే ఆవిష్కరించారు. పేద కుటుంబాలకు చెందిన ఆడబిడ్డలకు ముఖ్యమంత్రి జగనన్న కల్యాణమస్తు, షాదీ తోఫాను అందించి అండగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గవర్లకృష్ణయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు మునెమ్మ, తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీఓ రామచంద్ర, నేతలు నంద కుమార్, లాల్‌బాబుయాదవ్, ఎంపీటీసీ సభ్యుడు మూర్తి సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

శోత్రియ భూముల్లో దొంగలు పడ్డారు

- రాత్రికి రాత్రే దుక్కి దున్ని ఆక్రమణ
- అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడుతున్న గ్రామస్తులు


శోత్రియ భూములను దున్నేసిన ఆక్రమణదారులు

వరదయ్యపాళెం: మండలంలోని చిన్న పాండూరు పంచాయతీ వీకేఆర్‌పై కాలనీ భూ ఆక్రమణలకు అడ్డాగా మారింది. ఈ పరిసర ప్రాంతాల్లో విరివిగా పరిశ్రమలు రావడంతో ఇక్కడికి భూములకు ఎక్కడలేని గిరాకీ ఏర్పడింది. ప్రభుత్వ డీకేటీ భూమి ఎకరం కోట్లకు పడగలెత్తింది. ఊహించని విధంగా ఈ ప్రాంతంలో భూమి ధరలకు ఒక్కసారిగా రెక్కలు రావడంతో ఆక్రమార్కుల కళ్లు ఆ భూములపై పడ్డాయి. ఇన్నాళ్లు వీకేఆర్‌పైకాలనీలో గిరిజనులకు కేటాయించిన ఇంటి స్థలాలను దర్జాగా కొనుగోళ్ల పేరుతో ఆక్రమించుకున్నారు. తాజాగా సమీపంలోని పాదిరికుప్పం రెవెన్యూలో 1,056 ఎకరాల శోత్రియ భూములపై ఆక్రమార్కులు పాగా వేస్తున్నారు. ఆ దశగా 2రోజుల కిందట అర్ధరాత్రి శోత్రియ భూముల్లో ఓవైపు పొలం దన్నకాలు చేపట్టి ఆక్రమణ దశగా పావులు కదిపారు. దున్నిన పొలం సత్యవేడు-చిన్న పాండూరు ప్రధాన రోడ్డు మార్గానికి ఆనుకుని ఉండడంతో ఆ భూములను కబ్జా చేసేందుకు తెర వెనుక కొందరు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే కొంతమేరకు షికారీలు ఆక్రమించుకుని, ఆ భూమి తమ పూర్వీకులకు చెందిందిగా బుకాయిస్తూ గుడిసెలు ఏర్పాటు చేసుకున్నారు. ఇలాగే కొనసాగితే శోత్రియ భూములు పూర్తిగా ఆక్రమార్కుల పాలయ్యే ప్రమాదం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

చోద్యం చూస్తున్న రెవెన్యూ

శోత్రియ భూములు పెద్దఎత్తున ఆక్రమణలు జరుగుతున్నా పట్టనట్లు రెవెన్యూ యంత్రాంగం వ్యవహరిస్తోంది. పరిశ్రమల ఏర్పాటుకు ఎంతో అనువైన ప్రాంతంగా ఉన్న ఈ భూములు విచ్చలవిడిగా ఆక్రమణలకు గురవుతున్నాయి. ఓవైపు దుక్కి దున్నకాలు, మరోవైపు గ్రావెల్ అక్రమ రవాణా, షికారీల గుడిసెలు ఇలా ఆక్రమించినోడిదే భూమి అన్న చందంగా మారుతోంది. ఎంతో విలువైన భూములు అన్యాక్రాంతమవుతుంటే నియంత్రించాల్సిన రెవెన్యూ శాఖ చోద్యం చూస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విచారణ చేస్తాం



శోత్రియ భూముల్లో అక్రమంగా దున్నకాలు చేపట్టిన విషయం ఆలస్యంగా మా దృష్టికి వచ్చింది. వివిధ కేసులకు సంబంధించి హైకోర్టు విధుల్లో ఉన్నాను. వచ్చిన వెంటనే శోత్రియ భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఆక్రమణలు, ఇతర కార్యకలాపాలపై విచారణ చేసి కఠిన చర్యలు తీసుకుంటాం.

– గౌరీశంకరరావు, తహసీల్దార్, వరదయ్యపాళెం

ముక్కంటి సేవలో సాయి ధరమ్‌తేజ్


జ్ఞాపిక అందజేస్తున్న చైర్మన్ శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని మంగళవారం హీరో సాయిధరమ్‌తేజ్ దర్శించుకున్నారు. పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు ఆయనను ఆశీర్వదించారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక,తీర్థప్రసాదాలనుచైర్మన్ అందజేశారు.

రేపు జాబ్ మేళా

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో గురువారం జేకేసీ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీలత మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫాక్స్‌కన్‌టెక్నాలజీ గ్రూప్ పరిశ్రమ వారు ఈ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు పదవ తరగతి, నుంచి డిగ్రీ వరకు ఫాస్ లేదా ఫెయిల్, 18 నుంచి 29 సంవత్సరాలు లోపు మహిళలు అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి రూ.17వేలు జీతం, ఉచిత వసతి ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, బ్యాంకు పాసుపుస్తకం, విద్యార్హత సర్టిఫికెట్, బయోడేటా, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో 30వ తేదీ ఉదయం 10 గంటలకు కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9440502338, 9840332850 నంబర్లను సంప్రదించ వచ్చని పేర్కొన్నారు.

జ్యోతీరావ్ పూలేకు నివాళి


శ్రీకాళహస్తిలో నివాళులర్పిస్తున్న సభ్యులు


టీవీఎంకండ్రిగలో పూలే చిత్రపటానికి నివాళి

శ్రీకాళహస్తి: పట్టణంలో మంగళవారం రాధా రంగ మిత్రమండలి ఆధ్వర్యంలో జ్యోతీరావ్‌పూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. నియోజవకర్గ అధ్యక్షుడు సిద్ధులగారి ప్రసాద్ పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పూలే సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు పగడాల ప్రతాప్, సభ్యులు అరిగెల వేణు, ఎస్‌వీ రమణ, ప్రసాద్, సతీష్, సుధాకర్, నాగరాజు, ఉమాపతి, సుబ్రహ్మణ్యం, రవి, కుమార్, లతీఫ్,గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

తొట్టంబేడు (శ్రీకాళహస్తి) : మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను కొనసాగిద్దామని ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వడ్లతాంగల్ బాలాజీ ప్రసాద్ రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి మండలం టీఎంవీ కండ్రిగలో మంగళవారం జ్యోతిరావు పూలే 133వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి జ్యోతిరావు పూలే చేసిన సేవలను వివరించారు. ఆయన ఆశయ సాధన కోసం బీసీ వర్గాలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తిలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సహకారంతో జ్యోతిరావు పూలే విగ్రహం ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు. బీసీ సంఘ నాయకులు మునిరాజారెడ్డి, మాధవరెడ్డి, శ్రీనివాసులు, లోకేష్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం


గురవారెడ్డి


నాగరాజు

ఏర్పేడు: యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా గురవారెడ్డి ఏకగ్రీవంగా నియమితులయ్యారు. మంగళవారం శ్రీకాళహస్తి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ కార్యదర్శులు మోహన్ బాబు, శ్రీనివాసులు ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశం జరిగింది. మండల అధ్యక్షుడిగా గురవారెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా సంజీవయ్య, సహాధ్యక్షుడిగా మునిరత్నం, ప్రధాన కార్యదర్శిగా నాగరాజు, జిల్లా కౌన్సిలర్‌లుగా భక్తవత్సలం, సీతాపతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

రీ సర్వే సద్వినియోగం చేసుకోండి

ఏర్పేడు: భూముల రీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్ఐ సంతోష్ అన్నారు. మంగళవారం మండలంలోని ఇసుకతాగేలిలో సర్పంచ్ గురవమ్మ ఆధ్వర్యంలో రీసర్వేపై గ్రామసభ జరిగింది. ఆర్ఐ మాట్లాడుతూ రీసర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. భూములను సర్వే చేసి పక్కాగా యజమాని పేరుతో ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ మండల అధికార ప్రతినిధి కందాటి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

5 సవర్ల బంగారు చైన్ చోరీ

నాయుడుపేటటౌన్: గుడికి వెళ్లి తిరిగి వచ్చేలోపే గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి డ్రెసింగ్ టేబుల్‌లో దాచి ఉంచిన 5 సవర్ల బంగారు అపహరించుకుని వెళ్లినట్లు బాధితులు మంగళవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల కథనం మేరకు.. నాయుడుపేట పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌లో నివాసం ఉంటున్న మహేంద్ర, హేమ దంపతులు మంగళవారం సాయంత్రం పట్టణంలో గుడికి వెళ్లారు. తిరిగి ఇంటికి వెళ్లే టప్పటికే తలుపులు తెరిచి ఉండడం గుర్తించారు. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బీరువా పక్కనే డ్రెసింగ్ టేబుల్‌లో ఉంచిన 5 సవర్ల బంగారు చైన్ కనిపించలేదు. ఈ విషయమై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆరుతడి పంటలపై దృష్టి సారించాలి

వెంకటగిరి రూరల్: వర్షాభావం నెలకొన్న నేపథ్యంలో రైతులు ఆరు తడి పంటలపై దృష్టి సారించాలని ఏడీఏ నాగార్జునసాగర్ సూచించారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బోరు బావుల్లో నీటి సౌకర్యం ఉన్నచోట ఆరు తడి పంటలు సాగు చేసుకోవాలన్నారు. పెసర రకం ఐపీఎం 2-14, డబ్ల్యూ జీజీ-42, మినుము రకాలు, టీబీజీ 104 , వేరుశనగ పంటలపై దృష్టి సారించాలన్నారు.